గుట్టలో నిత్య తిరుకల్యాణోత్సవం

స్వామి, అమ్మవారికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 7: పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శనివారం అత్యంత వైభవంగా సాగింది. సుదర్శన నారసింహహోమం, కల్యాణోత్సవ సేవను అర్చకులు నిర్వహించారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. అనంతరం సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలను పెట్టి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవ వైభవంగా చేపట్టారు. తిరువారాధన, సహస్రనామార్చన, శయనోత్సవ సేవలను అత్యంత వైభవంగా జరిపారు. సుమారు రూ.16 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖాజానాకు రూ.33,48,944 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

లక్ష్మీ నృసింహస్వామివారి కార్తిక ఆదాయం రూ.18,03,40,051

యాదగిరిగుట్ట : లక్ష్మీ నరసింహ స్వామి వారికి కార్తిక మాసం ఆదాయం గతేడాదితో పోలిస్తే పెరిగింది. ఈ ఏడాది రూ.18,03,40,051 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆదాయ వివరాలను దేవస్థానం అధికారులు విడుదల చేశారు. గతేడాది రూ. 15,08,36,661 కోట్లు ఆదాయం రాగా, ఈసారి రూ.18,03,40,051కోట్లు వచ్చింది. గతంతో పోలిస్తే ఈ ఏడాది రూ. 2,95,03,389.22 కోట్లు అధికంగా వచ్చింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అన్నవరం అనంతరం అత్యధికంగా జరిగే సత్యనారాయణ స్వామి వ్రతాలు ఈ ఏడాది అధిక సంఖ్యలో జరిగాయి. గతేడాది 20,524 మంది భక్తులు వ్రతాల్లో పాల్గొనగా రూ. 1,64,20,600 ఆదాయం వచ్చింది. ఈ ఏడాదిలో అధికంగా 23,248 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొనగా రూ. 1,86,10,400 కోట్లు సమకూరింది. ప్రసాద విక్రయాల ద్వారా గతంతో పోలిస్తే ఆదాయం గణనీయంగా పెరిగింది. 2023లో రూ. 3,50,79,660 ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 3,71,94,240 ఆదాయం వచ్చిందని గతంతో పోలిస్తే ఈసారి 21,14,580లక్షలు పెరిగింది. గతేడాది వీఐపీ దర్శనంతో రూ.99,00,000 రాగా ఈ ఏడాది అధికంగా రూ. 1,37,48,550 ఆదాయం వచ్చింది.

నెమిలేలో రక్తదానం

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

రాజపేట, డిసెంబర్ 7 : మండలంలోని నెమిలే గ్రామంలో బీఆర్ఎస్ మండల నాయకుడు మేక వెంకటేశ్వర్‌రెడ్డి కుమారుడు సాయి షణ్ముఖరెడ్డి జన్మదినం సందర్భంగా శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది హాజరై రక్తదానం చేసినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు విశ్రాంత అడిషనల్ కలెక్టర్ రావుల మహేందర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు డాక్టర్ హమీద్ పాషా, ఎస్సీ ఉపేందర్‌రావు, ఎస్సీ స్పందన, జిల్లా డైరెక్టర్ జంపాల అంజయ్య, బీఆర్ఎస్ మండల నాయకులు మేక వెంకటేశ్వర్ రెడ్డి మేకల రమేశ్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

• బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు పచ్చిమట్ల వంశీగౌడ్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

బీబీనగర్, డిసెంబర్ 7 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బీఆర్ఎస్‌వీ మండలాధ్యక్షుడు పచ్చిమట్ల వంశీగౌడ్ అన్నారు. మండలంలోని జమీలాపేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను శనివారం ఆయన సందర్శించి విద్యార్థులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని, పాఠశాలలో పీఈటీ లేరని, వెంటనే నియమించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్య పర్చి, విద్యార్థుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎండీ మున్నా, నాయకులు కడెం కిరణ్ కుమార్, బండమీది భానుగౌడ్, ఎర్కల క్రాంతి పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు వసతులు కల్పించాలి : డీఆర్‌డీఓ

సామాజిక తనిఖీల్లో పాల్గొన్న అధికారులు

చౌటుప్పల్‌రూరల్, డిసెంబర్ 7 : ఉపాధి కూలీలకు సరైన వసతులు కల్పించాలని అడిషినల్ డీఆర్‌డీఓ సురేశ్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన 15వ విడుత సామాజిక వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా వేదికలో 26 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఎంజీఎస్, ఆర్ఈజీఎస్ తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్ కుమార్, డీపీఓ ఉపేందర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ వీరమళ్లు, ఆదిత్య, గంగరాజు, ఈశ్వరయ్య, రమాదేవి, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి : డాక్టర్ మనోహర్

వైద్యాధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్

చౌటుప్పల్‌రూరల్, డిసెంబర్ 7 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో శనివారం మండల వైద్యాధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ కాటంరాజు, సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఝాన్సీ, ఇస్తారి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బస్సు.. బాలికకు తీవ్రగాయాలు

వలిగొండ, డిసెంబర్ 7 : మండలంలోని మాందాపురం గ్రామ పరిధిలో శనివారం బైక్‌ను బస్సు ఢీ కొట్టిన ఘటనలో బాలికకు తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన గోపాల్ – శిల్ప దంపతులు భువనగిరి నుంచి వలిగొండ వైపునకు బైక్‌పై వస్తున్నారు. మాందాపురం గ్రామ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల నుంచి వస్తున్న బైక్ అదుపు తప్పి ఢీ కొన్నది. ఈ ఘటనలో గోపాల్ దంపతులకు స్వల్ప గాయాలు కాగా వారి కుమార్తె రీక్షిత(7)కు తీవ్ర గాయాలయ్యాయి. రీక్షితను 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

సంగెంలో విషాదచాయలు

వలిగొండ, డిసెంబర్ 7 : భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురం పరిధిలో శనివారం తెల్లవారు జామున కారు ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు యువకుల్లో మండలంలోని సంగెం గ్రామానికి చెందిన కలకోటి అక్షయ్‌కుమార్ కూడా ఉండడంతో గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. సంగెం గ్రామానికి చెందిన కలకోటి నరసింహాచారి – విమల దంపతులు 20 ఏండ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి వడ్రంగి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు అక్షయ్‌కుమార్ తరచూ గ్రామానికి వస్తూ అందరితో కలుపు గోలుగా మాట్లాడేవాడని ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని గ్రామస్తులు, బంధువులు దిగ్భ్రాంతి చెందుతున్నారు.

దాతల సహకారం ఉన్నతమైంది

• కలెక్టర్ హనుమంతరావు

దుప్పట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 7 : దాతల సహకారం ఎంతో ఉన్నతమైందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల కోసం పట్టణానికి చెందిన దాత గోపాల్ అగర్వాల్ అందించిన 3000 బెడ్ షిట్‌లను శనివారం కలెక్టరేట్‌లో హాస్టల్ అధికారులకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ట్రైబల్ హాస్టల్‌కు 528, బీసీ వెల్ఫేర్‌కు 1,007, ఎస్సీ వెల్ఫేర్‌కు 100, కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు 1,365 బెడ్ షిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ ఏసీ వీరారెడ్డి, స్థానిక సంస్థల ఏసీ గంగాధర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డీఈఓ సత్యనారాయణ, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి యాదయ్య పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం : బీఆర్ఎస్


రామన్నపేటలో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

రామన్నపేట, డిసెంబర్ 7 : బీఆర్ఎస్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం అన్నారు. నల్లగొండ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటారనే నేపథ్యంతో శనివారం బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయగా దాన్ని నిరిసిస్తూ మల్లేశం మాట్లాడారు. వారిలో మాజీ ఎంపీటీసీ సాల్వేరు అశోక్, పున్న వెంకటేశం, నాయకులు మిర్యాల మల్లేశం, లవణం రాము, జాల అమరేందర్‌రెడ్డి, నల్ల సైదులు, బాసాని రాజు, రెముడాల వెంకటేశ్, నర్సింహ ఉన్నారు.

కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 7 : సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు శనివారం రెండో రోజు కూడా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు ఉమా, డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేసే వరకు, అందుకు సంబంధించిన జీఓ వచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనరసింహ, మంగ పాండరి పాల్గొన్నారు.

భువనగిరిలో ఆటోల బంద్ నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

ఆటో డ్రైవర్ల బంద్

భువనగిరి అర్బన్, డిసెంబర్ 7 : రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ పిలుపు మేరకు జైబీమ్ ఆటో డ్రైవర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొమ్ము జగదీశ్‌బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులకు ఉపాధి లేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బంద్ నిర్వహించామని, సమస్యలు తీర్చకుంటే ర్యాలీలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెల్వేటి శ్రీనివాస్, నర్సింగ్‌రావు, నాయకులు యాట మధు, దశరథ, మోసిన్, శ్రీను, సిద్దిఖ్, పాశం రాజు, జహంగీర్, నవీన్, నరేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : రవి

మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

భువనగిరి అర్బన్, డిసెంబర్ 7: ట్రెజరీల్లో అమోదం పొంది ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సంఘం జిల్లా మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలున్న 4 వాయిదాల డీఏలు వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ నివేదికను తెప్పించి ఉద్యోగ సంఘాలతో చర్చించి అమలు చేయాలని కోరారు. 317 జీఓ ప్రకారం బాధితులందరికీ న్యాయం చేయాలని, అన్ని జిల్లాలకు డీఈఓ, అన్ని మండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేసి రెగ్యూలర్ నియామకాలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28, 29, 30వ తేదీల్లో నల్లగొండలో జరిగే సంఘం రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, యాదయ్య, సైదులు, రాజగోపాల్, ముత్యాలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 7 : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన వంగేటి లింగారెడ్డికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.33 వేల చెక్కును శనివారం నాయకులు పానుగంటి లింగస్వామి ఆయనకు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టింగిల్‌కార్ వెంకటేశ్, నాయకులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చౌటుప్పల్, డిసెంబర్ 7 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో శనివారం ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చింతల భారతమ్మ(50) సంపులోని నీటిని ఇంటిపై ట్యాంకులోకి ఎక్కించేందుకు విద్యుత్ కనెక్షన్ జాయింట్ చేస్తుండగా షాక్ తగిలింది. దట్టమైన పొగలు లేవడంతో చుట్టుపక్కల వారు వచ్చి భారతమ్మను ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

బైక్ దగ్ధం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 7 : పాతకక్షల నేపథ్యంలో బైక్ దగ్ధం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌ఓ వి. సంతోశ్ కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని తాజ్‌పూర్ గ్రామానికి చెందిన రాంపల్లి అరుణ్‌కుమార్ తన ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేసి నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన రాంపల్లి ప్రదీప్ కుమార్ పాత కక్షలను మనుసులో పెట్టుకొని శుక్రవారం అర్ధరాత్రి బైకుపై పెట్రోల్ పోసి దహనం చేశాడు. అరుణ్ కుమార్ ఫిర్యాదు మేరకు ప్రదీప్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతోశ్ కుమార్ పేర్కొన్నారు.

మహిళా సాధికారతతోనే ఆర్థిక ప్రగతి : భార్గవి

సదస్సులో మాట్లాడుతున్న భార్గవి, నిఖిత

వలిగొండ, డిసెంబర్ 7 : మహిళా సాధికారతతోనే సమాజ ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని సాధికారత బృందం సభ్యులు భార్గవి, నిఖిత అన్నారు. జిల్లా మహిళ శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో శనివారం వెల్వర్తి సెక్టార్ పరిధిలోని వేములకొండ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వంగపల్లి రైల్వేస్టేషన్ వద్ద నిలిచిన గూడ్స్ రైలు

యాదగిరిగుట్ట, డిసెంబర్7: వరంగల్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న గూడ్స్ రైలు శుక్రవారం రాత్రి వంగపల్లి రైల్వే స్టేషన్ వద్ద నిలిచిపోయింది. ఇంజిన్‌లో సాంకేతిక లోపం వల్ల పొగలు రావడంతో పరిశీలించిన సిబ్బంది రైలును నిలిపివేశారు. రైల్వే ఇంజినీర్లు వచ్చి ఇంజన్‌ను పునరుద్ధరించడంతో శనివారం ఉదయం తిరిగి సికింద్రాబాద్‌కు వెళ్లింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని సిబ్బంది తెలిపారు.

గోశాలపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని ధర్నా

ఆలేరు టౌన్, డిసెంబర్ 7 : గోశాలపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేసి, శిక్షించాలని కోరుతూ ఆలేరు తాసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ, బీఆర్ఎస్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించి తాసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా దాడికి ఉపయోగించిన జేసీబీని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, నాయకులు కందుల శంకర్, కళ్లెం రాజు, శివకృష్ణ, దయ్యాల సంపత్, పత్తి వెంకటేశ్, బాల నర్సయ్య, వస్పరి స్వామి, శ్రీనివాస్, శేఖర్, భాస్కర్, రమేశ్, బీరప్ప, శ్రీరామ్, జంపాల శ్రీను, దశరథ ఉన్నారు.

టీఎస్ యూటీఎఫ్ నూతన కమిటీ

రాజాపేట, డిసెంబర్ 7 : టీఎస్ యూటీఎఫ్ మండల నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా రాపోలు మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జూల మహేందర్, ఉపాధ్యక్షులుగా దార్ల రామకృష్ణ, ధనలక్ష్మి, కోశాధికారిగా అఖిల్ ఎన్నికయ్యారు. పరిశీలకులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు మెతుకు సైదులు, జూకంటి కరుణాకర్ వ్యవహరించారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి : శ్రీనివాస్

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 7 : బీబీనగర్ మండలంలోని కొండమడుగులో కేఎస్ ఎన్ఆర్ గార్డెన్‌లో నేడు జరుగనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా 5వ మహా సభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ కట్ట రమేశ్ అన్నారు. మండలంలోని కూరెళ్లలో శనివారం మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దామోదర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య రవితో పాటు శ్రీను, సోమ య్య, కృష్ణ, వేణు, మౌనిక పాల్గొన్నారు.

శారాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారిగా భార్గవి

ఆలేరురూరల్, డిసెంబర్ 7 : మండలంలోని శారాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణిగా భార్గవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన నవీన్‌కుమార్ హైదరాబాద్‌కు బదిలీ కాగా, మేడ్చల్ ఫిర్జాదిగూడ నుంచి భార్గవి శారాజీపేటకు బదిలీపై వచ్చారు.

చెరువు కట్ట వద్ద ప్రహరీ ఏర్పాటు చేయాలని ధర్నా

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 7 : మండలంలోని జలాల్‌పూర్ చెరువు కట్టపై గల మూల మలుపు వద్ద రోడ్డు వెడల్పు చేసి, ప్రహరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో నాయకులు శనివారం రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చెరువు కట్టపై పలుమార్లు ప్రమాదం జరిగి.. చాలా మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. పోచంపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే దారిలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. వీధి లైట్లు, స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని కోరారు. అనంతరం సీపీఎం నాయకులు దుబ్బాక జగన్, మంచాల మధు, కోడె బాలనరసింహ, వడ్డేపల్లి యాదగిరి, తాసీల్దార్ మహేందర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బయలు బాలరాజు, నాయకులు కొయ్యడ శ్రీనివాస్, గోరంటి ప్రదీప్‌రెడ్డి, పాలకూర కుమార్, కేసారం సురేందర్‌రెడ్డి, గుండ్ల రమేశ్, భాస్కర్, దర్శన్ పాల్గొన్నారు.

చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో రాచకొండ సీపీ తనిఖీ

పోలీస్ స్టేషన్‌ను సందరిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

చౌటుప్పల్, డిసెంబర్ 7 : పట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం సాయంత్రం రాచకొండ సీపీ సుధీర్‌బాబు సందర్శించారు. జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన అనంతరం రోడ్డు మార్గంలో చౌటుప్పల్ మీదుగా హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా సీపీ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి బందోబస్తును పరిశీలించారు. సీఎం వెళ్లే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. చౌటుప్పల్ ట్రిపుల్ ఆర్ బాధితులు సీపీని కలిసి తమకు సహకరించాలని కోరారు. ఆయన వెంట డీసీపీ రాజేశ్ చంద్ర, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రాయగిరిలో మహా పడిపూజ

• హాజరైన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

పూజల అనంతరం మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

భువనగిరికలెక్టరేట్, డిసెంబర్ 7 : పట్టణ పరిధిలోని రాయగిరి శివాలయ ప్రాంగణంలో పెద్దగాని శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం 18వ మహా పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతల కిష్టయ్య పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి అభిషేకాలు

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శనివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు కలశ పూజ నిర్వహించారు. చిలువేరు బాల నరసింహ–సుజిత దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు రాపోలు రామచంద్రం, యానం శివకుమార్, గంగపురం వెంకటేశ్, దోర్నాల గణేశ్, శెట్టి శ్రీనివాస్, రేపాక జగన్‌గుప్తా, కర్నాటి నరసింహ, దొంత సుదర్శన్, నరసింహ ఉన్నారు.

టెక్స్‌టైల్స్ పార్కును సందర్శించిన విద్యార్థులు

మల్కాపురం టెక్స్‌టైల్ పార్క్‌లో ముద్రణ డిజైన్‌ల గురించి ఫ్యాషన్ విద్యార్థులకు వివరిస్తున్న కృష్ణమూర్తి

చౌటుప్పల్‌రూరల్, డిసెంబర్ 7 : మండలంలోని కొయ్యలగూడెం, మల్కాపురం గ్రామాల్లో హైదరాబాద్‌లోని ఆర్నిత ఫ్యాషన్ కళాశాల విద్యార్థులు శనివారం పర్యటించారు. కొయ్యలగూడేనికి చెందిన చేనేత కార్మికుడు దుద్యాల శంకర్ ద్వారా ప్రకృతి రంగులతో వస్త్రాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. మల్కాపురం గ్రామ పరిధిలోని టెక్స్‌టైల్ పార్క్ మినీ క్రాఫ్ట్‌లో ముద్రణ వస్త్రాల తయారీని సంస్థ నిర్వాహకుడు కృష్ణమూర్తి విద్యార్థులకు వివరించారు.

మనోధైర్యం కల్పించేందుకే కవాతు : వినోద్ గోపాల్

రామన్నపేటలో కవాతు నిర్వహిస్తున్న ఆర్ఏఎఫ్ బలగాలు

రామన్నపేట, డిసెంబర్ 7 : ప్రజల్లో మనోధైర్యాన్ని కల్పించేందుకు కవాతు దోహదపడుతుందని ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్ డిప్యూటీ కమాండర్ వినోద్ గోపాల్, సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆర్ఏఎఫ్ బలగాలు, సివిల్ పోలీసులు కవాతును నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అమ్మనబోలు చౌరస్తా వరకు కవాతు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఏఎఫ్ ఇన్స్‌పెక్టర్లు పూజారి, బి.రాజు, ఎస్ఐ మల్లయ్య, ఏఎస్ఐ సురేందర్ పాల్గొన్నారు.

పోస్టల్ ఉమెన్ నియామకం

ఇంటింటికి వెళ్లి ఆధార్‌కార్డులు అందిస్తున్న పోస్ట్ ఉమెన్ త్రిష

ఆత్మకూరు(ఎం), డిసెంబర్ 7 : ఈ నెల 5వ తేదీన ఆధార్ కార్డులు పంపిణి చేసేవారేరి అంటూ నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌కు కొత్తగా పోస్టల్ ఉమెన్ కందిమళ్ల త్రిషను శనివారం నియమించినట్లు పోస్టు మాస్టర్ అమర్‌నాథ్ తెలిపారు. ఆధార్‌కార్డులతో పాటు ఇతర ఉత్తరాలను పంపిణీ చేసేందుకు ఈమెను నియమించినట్లు పేర్కొన్నారు.

క్